క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు శ్రీరామరక్ష



గుండుగొలనులో చిన్నారికి టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

భీమడోలు: వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు శ్రీరామరక్ష అని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఆశ అన్నారు. గుండుగొలను సచివాలయం -2 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి వ్యాధినిరోధక టీకాల పంపిణీని పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా హాజరైన గర్భిణులు, బాలింతలకు ఆమె ఆరోగ్య సూత్రాలను వివరించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు గల ఆహారాన్ని భుజించాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు పిల్లలకు టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై తహసీల్దార్ విచారణ



కొవ్వలిలో స్పందన ఫిర్యాదుపై విచారణ చేస్తున్న తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య

దెందులూరు: దెందులూరు తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య శనివారం కొవ్వలిలో స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహించారు. స్పందన ఫిర్యాదులోని అంశాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. పరిస్థితులను పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు.

ఈ-పంట నమోదు



పెదకడిమిలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయాశాఖాధికారులు

పెదవేగి : మండలంలో ఈ-పంట నమోదు కార్యక్రమం మొదలైందని రైతులందరూ ఈ విషయాన్ని గమనించి పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం ప్రియాంక తెలిపారు. శనివారం మండలంలోని పెదకడిమి, అమ్మపాలెం, కొప్పాక, గ్రామాలను ఆమె సందర్శించి ఈ-పంట నమోదును పరిశీలించారు. ఇప్పటికే 2536.25 ఎకరాల్లో పంట నమోదైందని ఆమె తెలిపారు. వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు త్వరితగతిన ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు.

వేద పండితునికి సన్మానం



రవిప్రకాష్ శర్మను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆస్థాన వేద పండితుడు యనమండ్ర వెంకట రవిప్రకాష్ శర్మ అవధానిని శనివారం ఆలయంలో ఘనంగా సన్మానించారు. యజుర్వేదం పూర్తి చేసిన సందర్భంగా రవిప్రకాష్ శర్మకు గత నెలలో హైదరాబాద్‌కు చెందిన రుద్రాక్ష పీఠం సంస్థ సింహతలాటం (స్వర్ణ కంకణం)తో సన్మానించి యజుర్వేద విశారద బిరుదు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా దేవస్థానంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు, అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు కూరాళ్ల రమాదేవి తదితరులు రవిప్రకాష్ శర్మను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

ఉపాధ్యాయుల ధర్నా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల, బదిలీ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఉత్తర్వులను నిలుపుదల చేయాలని, జీఓ 117 నిలుపుదలను రద్దు చేయాలని కోరారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పీబీవీఎస్ఎల్ నారాయణ, సెక్రటరీ జనరల్ గుడిమెళ్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర కోచైర్మన్ బి.మనోజ్ కుమార్, పీఎస్ ప్రకాశరావు, షేక్ రంగవలీ, బి.రెడ్డి దొర పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రకృతి సేద్యం సిబ్బందికి బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు శనివారం కోరారు. జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేస్తోన్న 450 మంది సిబ్బందికి ఆరు నెలల జీతాలు రూ.44 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఉప ఎన్నికలు



ఉంగుటూరు: కాకర్లమూడి ఒకటోవార్డుకి ఎన్నికైన రాయి నాగమణికి ఎన్నికైన ధ్రువీకరణపత్రం అందజేత



పెదవేగి: తాళ్లగోకవరం 3వ వార్డులో విజయం సాధించిన అభ్యర్థికి ధ్రువీకరణపత్రం అందజేస్తున్న అధికారులు



పెదపాడు: వీరమ్మకుంట సర్పంచ్‌గా నియామక పత్రాన్ని అందుకుంటున్న మరడాన వెంకట లక్ష్మణ సోమేశ్వరరావు



వీరమ్మకుంట సర్పంచ్ అభ్యర్థితో కలిసి ఎమ్మెల్యే కొఠారు ర్యాలీ

ఉంగుటూరు: కాకర్లమూడి గ్రామ పంచాయతీలో 1వార్డు, 5 వార్డుకి నిర్వహించిన ఉప ఎన్నికలలో ఒకటి వైఎస్సార్ సీపీ, ఒకటి టీడీపీకి దక్కింది. శనివారం ఎన్నికల అధికారి రవి పోలింగు ప్రక్రియను పర్యవేక్షించారు. 1వార్డుకి నిర్వహించిన ఎన్నికలలో పోటీ పడిన రాయి నాగమణికి 65 ఓట్లు లభించగా, ప్రత్యర్థి రాజాన వరలక్ష్మికి 48 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదు. 17 ఓట్ల మెజారిటీతో రాయినాగమణి (వైఎస్సార్ సీపీ మద్దతు) విజయం సాధించారు. 5వార్డుకి నిర్వహించిన పోలింగులో గేడే రాజుకు 72 ఓట్లు రాగా, తోట దివాకర్‌కి 52 ఓట్లు పోలయ్యాయి. దాంతో గోడే రాజు 20 ఓట్ల మెజారిటీతో (టీడీపీ మద్దతుతో) విజయం సాధించారు. తహసీల్దారు వెంకటరమణ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్డీ షంషుద్దీన్ పర్యవేక్షించారు. సీఐ సుభాష్, ఎస్సై స్వామి పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెదనింద్రకొలనులో ..

నిడమర్రు: పెదనింద్రకొలను గ్రామ పంచాయతీ 9వ వార్డు మెంబర్ ఉప ఎన్నికల్లో గౌను గుర్తు అభ్యర్థి గంధం వెంకట పుల్లారావు 32 ఓట్లు మెజార్టీతో విజయం సాధించినట్లు ఎంపీడీవో జి. విజయకుమారి తెలిపారు. మొత్తం 358 ఓట్లుకు 312 ఓట్లు పోలయ్యాయి. జనసేన బలపరిచిన గంధ వెంకట పుల్లారావుకు 141 ఓట్లు, వైసీపీ బలపరిచిన అచ్యుత వెంకట సత్యవతికి 109 ఓట్లు, టీడీపీ బలపరిచిన బడ్డిరెడ్డి వాసుకి 64 ఓట్లు పోలయ్యాయి.

గణపవరం 12 వార్డు వైసీపీ బలపరిచిన అభ్యర్థి గెలుపు

గణపవరం: గణపవరం గ్రామ పంచాయతీ 12 వార్డు ఉప ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థి తాడి దుర్గ టీడీపీ బలపరిచిన అభ్యర్థి బి. శ్రీనివాసరావుపై 45 ఓట్లు మెజార్టీతో విజయం విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి కె.బాలయ్య తెలిపారు.

ఉప ఎన్నికల సందడి

భీమడోలు: పోలసానిపల్లి 12వ వార్డు ఉప ఎన్నిక శనివారం ప్రశాతంగా సాగింది. 10 ఓట్లు స్వల్ప మెజార్టీతో మహిళా అభ్యర్థిని పాముల ధనలక్ష్మీ (గౌను) సమీప అభ్యర్థి బొద్దాని ప్రసాద్ (స్టూల్)పై విజయాన్ని సాధించింది. ఆమెకు ఎన్నికల అధికారిణి జీవన సంధ్య, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. పోలసానిపల్లి పంచాయతీ పరిధిలోని 12వ వార్డు పరిధిలోని 326 మంది ఓటర్లలో 283 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 87 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన పోలింగ్‌కు ఓటర్లు క్యూ కట్టారు. చలంశెట్టి నూకమ్మ(95) ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించారు. పోలింగ్ కేంద్రాన్ని భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. మధ్యాహ్నం కౌంటింగ్ నిర్వహించారు. టీడీపీ బలపర్చిన పాముల ధనలక్ష్మీ 117 ఓట్లు, వైఎస్సార్ సీపీ మద్దతుదారుడికి 107 ఓట్లు, జనసేన మద్దతుదారుడు గారపాటి రాజు 49 ఓట్లు పోలయ్యాయి. 10 చెల్లని ఓట్లు పోలైయ్యాయి.

ఉప ఎన్నికల్లో విజయకేతనం

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంటలో శనివారం నిర్వహించిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థి మరడాన వెంకటలక్ష్మణ సోమేశ్వరరావు(చంటిబాబు), తన సమీప టీడీపీ అభ్యర్థి మరడాన నాగబాబుపై 286 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శనివారం సాయంత్రం ఆయన ఎన్నికల అధికారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. గ్రామంలోని 1,895 ఓట్లకు 1,592 ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం 2గంటల నుంచి నిర్వహించిన లెక్కింపులో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సోమేశ్వరరావుకు, 911 ఓట్లు, టీడీపీ మరడాన నాగబాబుకు 625 ఓట్లు పోలయ్యాయి. 36 ఓట్లు నోటాకు వేసారు. మరో 20 ఓట్లు చెల్లలేదు. పోలింగ్ ప్రక్రియను అడిషనల్ ఎస్పీ ఎంజేసీ భాస్కర్‌రావు, డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ ఆర్డీవో పెంచల్ కిశోర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. రిట్నరింగ్ అధికారిగా ఏలూరు ఎంఈఓ ఆర్ రంగయ్య నిర్వహించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు. పాతముప్పర్రులో 10వ వార్డు మెంబరుగా బూరాడ సోమేశ్వరి, ముదురుమాక అన్నమ్మపై 28ఓట్ల మెజార్టీతో గెలుపు పొందారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: మండలంలో శనివారం నాలుగు వార్డులకు నిర్వహించిన ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొవ్వలిలో 11వ వార్డుకు మొండి శ్రీనివాసరావు, గోపన్నపాలెంలో 11వ వార్డుకు వెలివెల సత్యనారాయణ, కొత్తగూడెంలో 5వ వార్డుకు కేశ రాణి, 11వ వార్డుకు మురపాక సరోజిని వార్డు మెంబర్లుగా గెలుపొందారు. శనివారం సాయంత్రం నలుగురు వార్డు సభ్యులకు రిటర్నింగ్ అధికారులు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను పోలింగ్ స్టేషన్ల వద్ద అందజేశారు. కొవ్వలి వార్డు సభ్యుడిగా గెలుపొందిన మొండి శ్రీనివాసరావు గ్రామం ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించిన తరువాత టీడీపీలో చేరారు. టీడీపీ బలపర్చిన మిగిలిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించారు.

పెదవేగి మండలంలో..

పెదవేగి : మండల వ్యాప్తంగా రెండు వార్డు మెంబర్ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. పెదవేగి మండలం తాళ్లగోకవరం 3వ వార్డు, చక్రాయిగూడెం 8వ వార్డు మెంబర్ స్థానాలకు శనివారం పోలింగ్ నిర్వహించారు. చక్రాయిగూడెంలో పక్షవాతానికి గురైన ఓ వృద్ధురాలు ఓటు వేసేందుకు రాగా ఆమెను ఎస్సై ఎం లక్ష్మణ్ తన సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రం లోపలికి కుర్చీలో కూర్చొబెట్టుకుని మోసుకెళ్లి ఓటు వేయించారు.

తాళ్లగోకవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు

తాళ్లగోకవరం 3వ వార్డు మెంబర్ స్థానానికి వైఎస్సార్ సీపీ బలపర్చిన చింతపల్లి నాగరాజుకు 82 ఓట్లు రాగా, టీడీపీ బలపర్చిన దంపనబోయిన జ్యోతికి 57 ఓట్లు పోలయ్యాయి. 25 ఓట్ల మెజారిటీతో నాగరాజు విజయం సాధించగా, మండల తహసీల్దార్ ఎస్ నాగరాజు, రిటర్నింగ్ అధికారి మధుమోహన్ ఎన్నిక పత్రాన్ని అందించారు. అనంతరం గ్రామంలో భారీ ఊరేగింపుతో నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు విజయోత్సాహంతో సందడి చేశారు. చక్రాయిగూడెంలో 8వ వార్డు మెంబర్ స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సిరికి సత్యవతికి 44 ఓట్లు పోల్ అవ్వగా, టీడీపీ అభ్యర్థి గొట్టాపు వాణికి 93 ఓట్లు పోలయ్యాయి. 49 ఓట్ల మెజార్టీతో వాణి విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భీమడోలు: పోలసానిపల్లి పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కట్టిన ఓటర్లు



విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



విజయచిహ్నం చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వృద్ధురాలిని కుర్చీసాయంతో పోలింగ్ కేంద్రానికి తీసుకెళుతున్న ఎస్సై, సిబ్బంది

రోడ్ల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన



వీరమ్మకుంటలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో మంగళవారం రహదారులు నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి హామీ ఇచ్చారు. పెదపాడు మండలంలోని వీరమ్మకుంట ఉప ఎన్నిక విజయోత్సవ ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వీర్మకుంట ఉప ఎన్నికలో 286ఓట్ల మెజార్టీతో వైఎస్సార్ సీపీ మద్దతుదారులను గెలిపించి నాయకుల్లో మరింత బాధ్యత పెంచిందన్నారు. గ్రామంలో మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎస్టీలకు కుల ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందిస్తామని చెప్పారు. స్థానిక నాయకుల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వీరమ్మకుంట నుంచి పెదపాడు వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, సంబంగి శ్రావణ్‌కుమార్, పామర్తి అచ్యుత్‌గౌడ్, స్థానిక నాయకులు పూడి రంగప్పారావు, మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు, రెడ్డి జగన్, గుణుపూరు మహేష్, రెడ్డి రంగారావు పాల్గొన్నారు.

పంటలకు జీవం పోసిన వర్షం

- అన్నదాతల హర్షం
- నియోజకవర్గంలో 21,105 హెక్టార్లలో పంటల సాగు



పెదవేగిలో వరి పొలం

పెదవేగి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. ఇది పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలున్నాయి. వీటిలో ప్రస్తుతం 21,105 హెక్టార్లలో ఖరీఫ్‌లో వివిధ పంటలు రైతులు సాగు చేస్తున్నారు. వీటిలో వరి, మొక్కజొన్న, చెరకు, వంగ, తదితర పంటలు ఉన్నాయి. విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాధార మెట్ట పంటలు కావడంతో గతంలో రైతులు ఇదే సమయంలో సరైన వర్షాలు లేక పంటలకు జీవం లేకుండా ఉండేవి. ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా రైతులు ట్యాంకర్లు, ఇంజిన్ల ద్వారా నీరు పెట్టుకుంటూ అష్టకష్టాలు పడేవారు. అలాంటి పరిస్థితులకు అవకాశం లేకుండా ఖరీఫ్ ప్రారంభం నుంచి విస్తారంగా కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. మరింత వర్షం కురిస్తే పంటలకు మేలు కలుగుతుందని రైతులు అంటున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రజలకు ఉపశమనం కలిగించాయి. శనివారం రోజంతా జల్లులు పడుతూనే ఉండటంతో రైతులతో పాటు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారి ఎం ప్రియాంక మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురిశాయని, దీంతో పంటలకు మేలు చేకూరుతుందన్నారు.

గోవింద నామ సంకీర్తన ముగింపు ఉత్సవం



మహిళా మండలి సభ్యులను సన్మానిస్తున్న దేవస్థానం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విశ్వశాంతి, లోకకళ్యాణార్థం స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో గత 60 రోజులుగా పద్మావతి మహిళా మండలి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు కోటీ 18 లక్షల సార్లు గోవిందనామ సంకీర్తన చేశారు. ఈ అఖండ కోటి గోవిందనామ సంకీర్తన కార్యక్రమం ముగింపు ఉత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. గోవిందనామ సంపూర్ణ హోమం, లక్ష్మీనారాయణ, సుదర్శన, వేంకటేశ్వర, పద్మావతి మూల మంత్ర హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణాహుతి నిర్వహించి వేద ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో దేవస్థానంలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. స్వామి వారికి విశేష పూజల కోసం 108 బంగారు పుష్పాలను తమ ట్రస్ట్‌బోర్డు సభ్యుల సహకారంతో సమీకరించినట్టు చెప్పారు. ఇకపై ప్రతి గురువారమూ స్వామి వారికి బంగారు పుష్పాలతో పూజ చేయనున్నట్టు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు మాట్లాడుతూ స్వామి వారికి బంగారు నామాలు, శంఖచక్రాలు తయారు చేయించడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది భక్తులు స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. గోవిందనామ సంకీర్తనలో పాల్గొన్న పద్మావతి మహిళా మండలి సభ్యులను, ఈ కార్యక్రమానికి సహకరించిన భక్తులను దుశ్శాలువాలతో, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు నిధుల మంజూరు



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న హౌసింగు ఎండీ లక్ష్మీషా



చేబ్రోలు కాలనీలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగు ఎండీ లక్ష్మీషా

ఉంగుటూరు: చేబ్రోలులో నిర్మిస్తున్న జగనన్న హౌసింగు కాలనీలో అంతర్గత రహదార్లకు రూ.48 లక్షల నిధులు మంజూరు చేశామని హౌసింగు రాష్ట్ర కార్పొరేషన్ ఎండీ జి.లక్ష్మీషా వెల్లడించారు. శనివారం రాష్ట్ర హౌసింగు కార్పొరేషన్ ఎండీ జి .లక్ష్మీషా శనివారం పరిశీలించారు. నవరత్నాలులో పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా భారీ కాలనీని చేబ్రోలులో నిర్మిస్తున్నారు. 5.93 ఎకరాల్లో 259 ప్లాట్లు విభజించారు. 181 మంది అర్హులైన లబ్ధిరులు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా 84 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని ఎండీ లక్ష్మీషా పరిశీలిస్తూ గృహనిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 30న గృహ ప్రవేశాలు కార్యక్రమం నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగు పీడీ విజయరామరాజు, ఎస్ఈ కూర్మినాయుడు, ఈఈ రమాకాంత్, మండల ప్రత్యేక అధికారి గుండవరపు వెంకటరమణ, హౌసింగు డీఈ సోమేశ్వరరావు, ఏఈ సురేష్ బాబు, ఎంపీటీసీలు రాయిలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, కో ఆప్షన్ సభ్యుడు షాజహాన్, వైసీపీ నాయకుడు మనసాల కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల జీవితాల్లో వెలుగులు నింపిన డాగూరే



భీమడోలులో డాగూరే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

భీమడోలు: ఫొటోగ్రఫీ ఆద్యుడు డాగూరే సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్ల సంక్షేమం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం డాగూర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమడోలు బైపాస్ రోడ్డులోని భీమడోలు సంతమార్కెట్ వద్ద ఫొటోగ్రఫీ సృష్టికర్త డాగూరే, మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పిలంచారు. మిఠాయిలను పంచారు. ఈ సందర్భంగా భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ద్రాక్షారపు శ్రీరామ్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ కళని ఉపాధిగా చేసుకుని ఎన్నో కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. డాగురే కోట్లాది మందికి ఆరాధ్య దైవంగా, ఆదర్శమూర్తిగా నిలిచారని అన్నారు. ఫొటో గ్రాఫర్లు ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు అలజంగి రంగారావు, జిల్లా కోశాధికారి పుల్లాబోట్ల రామ్మూర్తి, సంఘం సభ్యులు నరేష్, నాగరాజు, చిన్ని దుర్గేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ డే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 184వ ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ దినోత్సవాన్ని నగరంలో ది ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక ఓవర్‌బ్రిడ్జి మెట్ల వద్ద ఉన్న కెమెరా సృష్టికర్త డాగురే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఏలూరు పరిసర ప్రాంతాల ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్ తనిఖీ

జంగారెడ్డిగూడెం : వసతిగృహంలో మెరుగైన వసతులు కల్పించి, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని బీసీ కళాశాల బాలికల వసతిగృహం వార్డెన్, సిబ్బందికి జంగారెడ్డిగూడెం జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేఎస్ఆర్ తేజస్వి సూచించారు. శనివారం జంగారెడ్డిగూడెం బీసీ కళాశాల బాలికల వసతిగృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

జంగారెడ్డిగూడెం : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం పట్టెన్నపాలానికి చెందిన పి.రాంబాబు కుమార్తె ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అయితే ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో యువతి తండ్రి రాంబాబు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె అదృశ్యం విషయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బండారు వీరాంజనేయులపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పంట రుణాలు అందించాలి

ఏలూరు (టూటౌన్): బ్యాంకర్లు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సాగు భూమిలో 70 శాతంపైగా కౌలు రైతులే పంటలు వేస్తున్నారని, బ్యాంకుల నుంచి పంట రుణాలు కౌలురైతులకు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. జిల్లాలో రెండు లక్షల మంది వరకు కౌలు రైతులు ఉన్నారని, వీరిలో 56 వేల మందికి పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేసినా భూ యజమాని పంట రుణం తీసుకున్నారనే పేరుతో కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని వివరించారు. కౌలు రైతులందరికీ రూ.లక్ష వరకు వడ్డీలేని పంట రుణ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. జిల్లాలో ఉద్యాన పంటల రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించాలన్నారు. గతంలో అమలు చేసిన డ్రిప్ సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పరిరక్షించాలి

ఏలూరు (టూటౌన్): భవన ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలని ఏపీ ప్రగతి శీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఇఫ్టూ) ఏలూరు నగర అధ్యక్షుడు కాకర్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి నవ్వుడు నెహ్రూబాబు కోరారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా చేశారు. కార్మిక శాఖలో పెట్టుకున్న క్లెయిమ్స్, కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న నిర్మాణ రంగకార్మికులకు కార్డు ఇచ్చేవిధంగా చేయాలన్నారు. నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి లేని సమయంలో ప్రభుత్వం ఆర్థికంగా సహకరించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, మూతపడిన సంక్షేమ బోర్డును తెరిపించాలని కోరారు. వర్మ, దుర్గారావు, భాస్కర రావు, ప్రసాద్ పాల్గొన్నారు.